వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి, ఐదుగురికి గాయాలు

లక్ష్మణచాంద, ఆగస్టు 23 : నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐ సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన వన్నెల పోశన్న నర్సాపూర్(డబ్ల్యూ) జాతీయ రహదారి 61పై మక్క కంకులను అమ్ముతున్నాడు. ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గోవింద్ సర్కార్, ఆటోలో బైంసా నుంచి మామడకు వెళ్తున్న దగెడ ప్రకాశ్‌లు మక్క కంకులు కొనక్కొంటున్నారు. ఆ సమయంలో ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు ఆగి ఉన్న ఆటోను ఢీకొ ట్టింది. ఈ ప్రమాదంలో వన్నెల పోశన్నతో పాటు మక్క కంకులు కొంటున్న గోవింద్ సర్కార్, దగెడ ప్రకాశ్‌లు తీవ్రంగా గాయ పడ్డారు. వన్నెల ముత్తన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామం ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన దోశ గంగాధర్ కనకాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద గద్దె అరుణ్ రోడ్డు దాటుతుండగా అతడిని కారుతో ఢీకొట్టాడు. అరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖానాపూర్, ఆగస్టు 23: మండలంలోని తర్లపాడు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రం ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ నుంచి భీర్నంది గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో పట్టణంలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కల్వర్టులో పడి ...

సోన్, ఆగస్టు 23: నిర్మల్ పట్టణంలోని మంజూలపూర్ గ్రామానికి చెందిన పడిగెల భూమన్న(55) ప్రమాదవశాత్తు కాల్వర్టులో పడి మృతి చెందినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ సాయికుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామ సమీపంలోని కాల్వర్టులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వర్టులో పడి మృతి చెందినట్లు వివరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు యువకులు..

సోన్, ఆగస్టు 23 : నిర్మల్ మండలం నిలాయిపేట్ గ్రామ పసమీపంలోని జాతీయ రహదారి44పై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు హైదరాబాద్‌లో చికత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. నిర్మల్ నుంచి బైక్‌పై మమడ మండలంలోని కిషన్‌రావుపేటకు వెళ్తుండగా లారీని ఢీ కొన్న ప్రమాదంలో సునీల్, రామరావులకు తీవ్ర గాయాలు కాగా దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు

బైక్, ఫోన్ చోరీ

ఎదులాపురం, ఆగస్టు 23 : బాత్రూమ్‌కు వెళ్లి వచ్చేలోపే ద్విచక్ర వాహనం, ఫోన్ మాయమైన ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి గ్రామానికి చెందిన దుర్వారాం శుక్రవారం ద్విచక్రవాహనంపై భీంసరి నుంచి గాంధీనగర్‌కు వస్తుండగా మార్గ మధ్యంలో బైక్‌లు పక్కన పెట్టి బాత్రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం దొంగతనానికి గురైంది. వెంటనే బాధితుడు స్టేషన్‌లో ద్విచక్రవాహనంతో పాటు వాహనం కవర్లో ఉన్న సెల్ ఫోన్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లోపించిన పారిశుధ్యం

కలెక్టర్ రావడంతో అప్రమత్తమైన అధికారులు

జైనథ్, ఆగస్టు 23 : మండలంలోని 13 వార్డులతో ప్రస్తుత వర్షాకాలంలో మురికి కాల్వలు చెత్తచెదారం ఎక్కడికి అక్కడే ఉండడంతో గ్రామంలో పూర్తిగా పారిశుధ్యం లోపించింది. మండలకేంద్రమైన జైనథ్ గ్రామాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీఈవో, గ్రామ కార్యదర్శులు తమకు ఏ మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా గ్రామానికి చెందిన లింగాల దశిథ్ ఐదు సంవత్సరాల బాలుడికి డెంగ్యూ సోకి మూడు రోజులు గడుస్తుంది. ఇక్కడ వైద్యం అందకపోవడంతో ప్రస్తుతం ఆ బాలుడు ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మండల వైద్య ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాలతోపాటు మండలకేంద్రంలో శిబిరాలు, డ్రై డే ఫ్రైడే పెరిట కార్యక్రమాలు నిర్వహించి

గ్రామంలో తిరుగుతున్న వైద్య సిబ్బంది

చేతులు దులుపుకుంటున్నారు. తాజాగా విజయ డైరి పాల దుకాణం ప్రారంభోత్సవానికి కలెక్టర్ శుక్రవారం రానున్న నేపథ్యంలో మండలాధికారులు ఎక్కడికి అక్కడ పారిశుధ్యం పనులు చేపట్టారన్న విమర్శలు ఉన్నాయి. జైనథ్‌లో డెంగ్యూ ఇతర విష జ్వరాలు విజృంభిస్తున్నాయి.

అభివృద్ధి సంక్షేమ పథకాలు వందశాతం అమలు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 23 : జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పథకాలు వంద శాతం అమలు చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీ నగేశ్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం జిల్లా అధికారులతో అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రగతి పనుల లక్ష్యాలకు సంబంధించి పంచాయతీరాజ్, జాతీయ రహదారుల విభాగం, గ్రామీణాభివృద్ధి, మెప్మా, బీఎస్ఎన్ఎల్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ, జిల్లా పరిషత్, పలు శాఖల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ఎదులాపురం,ఆగస్టు 23: పట్టణంలో వీధి కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో వాటిని గుర్తించేందుకు సర్వే చేసి వెయ్యి కుక్కలను గుర్తించారు. శుక్రవారం బంగారుగూడలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లో పశుసంవర్ధక శాఖ అధికారి, వైద్యులు కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలి రోజు 20 కుక్కలకు ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిషన్ మాట్లాడుతూ కుక్కల్లో కరిచే తత్వం తగ్గించడంతో పాటు వాటి సంతతిని అరికట్టేలా స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. ఐదు రోజులు ఇక్కడే అబ్జర్వేషన్లో ఉంచి తీసుకవచ్చిన చోటే వదిలేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిషన్, వైద్యుడు దూద్దాం రాథోడ్, శానిటరి ఇన్స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి కృషి

ఉట్నూర్, ఆగస్టు 23 : గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం పీవో క్యాంప్ కార్యాలయంలో విబా, లీప్ వర్డ్‌తో ఒప్పందం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ ఒప్పందం నిర్వహించామన్నారు. దీంతో రానున్న రోజుల్లో ఉత్తమ ఫలితాలు సాధించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

సన్మానం

బైంసా, ఆగస్టు 23 : రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి క్వాటర్స్‌లో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కలిసి శాలువాతో సన్మానించారు. ముథోల్‌లో కొత్తగా నిర్మాణం అవుతున్న దవాఖాన పనులు బెస్‌మిట్ లెవల్‌లో ఆగిపోయాయని ఆ పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

దిలావర్‌పూర్, ఆగస్టు 23 : నిర్మల్– బైంసా 61వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బైకును కారు ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు యువ కులు మృతి చెందగా, మరో యువ కుడికి తీవ్ర గాయాలయ్యాయి. దిలా వర్‌పూర్ ఎస్ఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపి న వివరాల ప్రకారం.. నిర్మల్ నుంచి బైంసా వైపునకు వెళ్తున్న కారు, దిలావర్‌పూర్ నుంచి నిర్మల్ వైపునకు వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. దిలావర్‌పూర్ మండలం న్యూ లోలం గ్రామానికి చెందిన వెంకగారి చిన్నయ్య, బుజ్జి దంపతుల మొదటి కొడుకు వెంకగారి ప్రశాంత్(19), మల్లాపూర్ గ్రామానికి చెందిన చాపెల్లి సంజయ్(18) అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ఘటనలో వెంకగారి నితిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడిని చికిత్స నిమిత్తం నిర్మల్ దవఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సోన్, ఆగస్టు 23: మండలంలోని భాగ్యనగర్ గ్రామానికి చెందిన బానావత్ భీంరావు (57) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మృతుడు భీంరావు ఆరోగ్యం బాగులేక జీవితంపై విరక్తి చెంది ఈ నెల 20న పరుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటహుటిన దవఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావాలి

ఉట్నూర్ రూరల్, అగస్టు 23 : సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావాలని పీవీటీజీ ఏపీవో మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొంగచింత గ్రామంలో పీఎం జన్మన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఆధార్ కార్డులో సవరణలు, బ్యాంకు ఖాతా తెరవడం, ఆయుష్మాన్ భారత్‌లో పేరు నమోదు, పీవీటీజీ కమ్యూనిటి సర్టిఫికెట్ల జారీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సదుపాయాల గురించి, సీకిల్ సెల్ స్క్రీనింగ్ వంటి వాటి గురించి అవగాహన కల్పించారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం

ఎదులాపురం, ఆగస్టు 23 : ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అతిక్ బేగం మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమన్నారు. ప్రతి విద్యార్థి అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని అప్పుడే సరైన విషయ అవగాహన జరుగుతుందని వివరించారు. ఎన్సీసీ క్యాడెట్లు వ్యాసరచన, రంగోలి, పెయింటింగ్‌లో పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రారంభం

కుంటాల, ఆగస్టు, 23 : మండలంలోని ఆయా గ్రామాల్లో గతంలో లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లలో ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రారంభించినట్లు ఎంపీడీవో రహీం తెలిపారు. వివిధ స్థాయిల్లో అన్ని పరిశీలించిన తర్వాతనే అనుమతులు ఇవ్వబడుతాయని ప్రభుత్వ, వక్ఫ, ఇనాం, కోర్టు వివాదాలు శిఖం భూములలో ప్లాటు లేదా లే అవుట్ ఉంటే ఎల్ఆర్ఎస్ 2020 ప్రకారం అనుమతించబడుతుందని స్పష్టం చేశారు. ఫీల్డ్ వెరిఫికేషన్ ఉన్నప్పుడు ముందస్తు సమాచారం ఇస్తామని, దరఖాస్తు దారుడు పూర్తి సమాచారంతో హాజరై సహకరించాలని కోరారు. ఇక్కడ ఆర్ఐ అడెల్లు, ఇరిగేషన్ ఏఈ రమేష్, కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

బ్యాంకులో పడిగాపులు కాస్తున్న రైతులు

బ్యాంకుల వద్ద రైతన్నల పడిగాపులు

రైతు రుణ మాఫీ కాని వారితో పాటు రుణమాఫీ అయిన రైతులకు సైతం తిప్పలు తప్పడం లేదు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రుణమాఫీ అయిన వారు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నది. రెన్యూవల్ కోసం గంటల తరబడి బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు లోపలికి ఒక్కొక్కరినే అనుమతించడంతో బ్యాంకు బయటే రైతులు గంటల తరబడి నిలబడి బారులు తీరారు.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 23

మహిళల రక్షణకు అనేక చట్టాలు

ఉట్నూర్, ఆగస్టు 23 : మహిళలను రక్షించేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించిందని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. శుక్రవారం స్తానిక కొమురంభీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో డిగ్రీ విద్యార్థులకు యువతపై మత్తు పానీయాల ప్రాభావంపై అవగాహన కల్పించారు. అందులో భాగంగానే యువతకు, ముఖ్యంగా మహిళలకు సైబర్ క్రైం, ఇవ్ టీజింగ్, షీ టీం ప్రాముఖ్యత, డయల్ 100 అవశ్యకత లాంటి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్, అధ్యపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

28న జాతీయ క్రీడాదినోత్సవం

ఉట్నూర్, ఆగస్టు 23 : ఈనెల 28న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హకీ మంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఉదయం 8గంటలకు కేబీ కాంప్లెక్స్ ప్రధాన గేటు నుంచి క్రీడాదినోత్సవం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం హకీ ప్రదర్శన పోటీ ఉంటుందని తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఉట్నూర్, ఆగస్టు 23 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ దివ్యాంగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ 40 శాతం నుంచి 100 శాతం ఉన్న వారికి రిటైల్, హాస్పిటాలిటీ, బీఎఫ్ఎస్ఐ కోర్సులలో 2 నెలల పాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణతో పాటు వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తిగల 18–35 సంవత్సరాల యువత సర్టిఫికెట్లతో ఈనెల 30లోపు శిక్షణ ఉపాధి కేంద్రంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010295910ను సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్ కోసం దరఖాస్తులు

ఎదులాపురం, ఆగస్టు 23 : ప్రస్తుత విద్యా సంపత్సరంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. http:///bse.telangana.gov.in వెబ్ సైట్‌లో సందర్శించాలని సూచించారు. సెప్టెంబర్ 11 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకునేందుకు అవకాశముందని పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?

బ్లిట్జ్ కథనంపై వివరణ ఇవ్వండి: బీజేపీ ఎంపీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?.. పెళ్లయ్యిందంటూ బ్లిట్జ్ పత్రికలో ప్రచురితమైన కథనంపై వివరణ ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో రాహుల్‌గాంధీ కార్యాలయానికి వెళ్లి, అక్కడి సిబ్బందికి బ్లిట్జ్ పత్రికను అందజేశారు. ఆయన స్వయంగా పత్రికను చదివి, అందులో వచ్చిన కథనంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. భారతదేశ వ్యవహారాలకు సంబంధించి విదేశీ మీడియా సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక సరైనదేనని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ వాదిస్తున్నపుడు, బ్లిట్జ్ కథనం కూడా సరైనదేనా? అని ప్రశ్నించారు.

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని ఆల్–బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్త చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

పొలంలో మొసలి ప్రత్యక్షం

మల్దకల్, ఆగస్టు 23: పొలంలో మొసలి ప్రత్యక్షం కావడంతో కూలీలు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం మల్దకల్‌లో వారు పత్తి పనులు చేస్తుండగా.. మొసలి కనిపించడంతో పొలం యజమాని సవారన్నకు తెలిపారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు బంధించేందుకు యత్నించగా తప్పించుకొని సమీపంలోకి బావిలోకి దూరింది. నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోశారు. బావిలోని మొసలిని తాళ్లతో పట్టుకొని బయటకు తీసి కృష్ణానదిలో వదిలేశారు.

రాజన్న ఆలయంలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం 20 మంది ఏసీబీ అధికారుల బృందం 12 గంటల పాటు తనిఖీ చేయడంతోపాటు రికార్డు చేయగా, రెండోరోజు పది మంది అధికారులు స్వామివారికి సంబంధించిన లీజులు, పలు విభాగాల టెండర్లు, నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన పలు రికార్డులను 4 గంటలపాటు పరిశీలించారు. లడ్డూ ప్రసాదాల తయారీ, విక్రయాలు, గోదాం నిల్వలు, లీజుల టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసినట్లు తెలిసింది.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘట న వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవా రం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్–శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల



జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివ